## క్లుప్తంగా

### 16న ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్ ర్యాలీ

**పుంగనూరు:** పట్టణంలో ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఖండ పథ సంచలన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గోడపత్రికలను విడుదల చేశారు. రాష్ట్ర స్వయంసేవక్ సంఘ్ స్థాపించి వంద వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### ట్రాఫిక్ కష్టాలు



పీలేరు మార్గంలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాలు

**సదుం:** మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే సంత రోజు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పీలేరు మార్గంలో ఈ సమస్య అధికంగా ఉంది. ఒక వైపు రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, మరో వైపు రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ జామ్ అవుతోంది. బస్టాండులోనూ ద్విచక్ర వాహనాలను నిలిపి వెళ్లిపోతుండటంతో బస్సులు నిలిపేందుకు స్థలం లేక రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వాహనాలు పార్కింగ్, రోడ్లపై వ్యాపారాల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### వేడుకగా తిరుణాల

**చౌడేపల్లె:** మండలంలోని బయ్యపల్లెలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా తిరుణాల వేడుకగా నిర్వహించారు. స్వామికి ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రద్దీ నెలకొంది.

### మురుగుమయం



మిట్టూరులో కాలువ దుస్థితి ఇలా..

**చౌడేపల్లె:** మండలంలోని మిట్టూరులో పారిశుద్ధ్యం లోపించింది. మురుగునీటి కాలువలు శుభ్రం చేయపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు కాలువల్లో ముందుకు సాగడం లేదు. దీంతో దుర్వాసనతో పాటు దోమలకు నిలయంగా మారుతోంది. అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

### అటెండర్ హఠాన్మరణం



దామోదరం

**పలమనేరు:** పట్టణంలోని శివాలయంలో ఎండోమెంట్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న దామోదరం శుక్రవారం గుండెనొప్పితో మృతి చెందారు. ఆలయ ఈఓ కమాలకర్, సిబ్బంది ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### సొంత వాహనాలు అయితే వదిలేస్తామా!



చౌడేపల్లె ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తుప్పు పడుతున్న వాహనాలు

**చౌడేపల్లె:** ఒకప్పుడు ఆ జీపు ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులకు అనుకున్న గమ్యస్థానం చేర్చడంలో తోడ్పాటు అందించింది. ఆ నాడు అలా.. అయితే నేడు జీపును ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఓ మూలన ఆ వాహనాన్ని పడేశారు. ప్రస్తుతం చెట్ల కింద వానకు తడిసి.. ఎండకు ఎండుతూ తుప్పు పడుతోంది. వీటితో పాటు గతంలో టీడీపీ ప్రభుత్వంలో కొనుగోలు చేసిన చెత్త సేకరణ ఆటోలు మూలకు పడ్డాయి. మరమ్మతులు చేస్తే ఆటోలను వినియోగించుకోవచ్చు లేకుంటే విక్రయిస్తే ప్రభుత్వ ఆదాయానికి జమ అవుతుంది. ఇలా మనసొత్తు అయితే వదిలేస్తామా? అంటూ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆక్రమణ చెరవులు

- దర్జాగా నేతల మట్టి తవ్వకాలు, ఆక్రమణలు
- సప్లయ్ చానెళ్లు, వంకలనూ వదలని అక్రమార్కులు
- ఆక్రమణలతో మాయమైన కుంటలు, చెరువులు
- పలమనేరులో చెరువుల దుస్థితి ఇదీ



ఎగువ చెరువులో ఆక్రమించుకొని సాగు చేస్తున్న పంటలు, స్థిరనివాసాలు

**పలమనేరు:** నాడు రాజులు చెరువులను తవ్వించి రైతులకు మేలు చేశారు. ఇప్పుడు కొందరు ఉన్న చెరువులను మట్టి, ఇసుక కోసం నాశనం చేస్తున్నారు. మరికొందరు చెరువులను ఆక్రమించుకున్నారు. చెరువుకు నీరు వచ్చే మార్గాలైన సప్లయ్ చానెళ్లు, వాగులు, వంకలు ఆక్రమణలకు గురై వర్షపు నీరు చెరువుల్లోకి చేరకుండా పోతోంది. కూటమి అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా, ఇసుకాసురులు బాగున్న చెరువులను ధ్వంసం చేసేస్తున్నారు. మరికొందరు ఏకంగా తమ పొలాల్లోకి చెరువును కలిపేస్తున్నారు. కొందరు చెరువుల్లోనే పంటలు సాగు చేస్తూ ఇళ్లను సైతం కట్టేసుకున్నారు.

**ఇదిగో సాక్ష్యం...**

పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మిదొడ్డి రెవెన్యూ ఎగువ చెరువును కొందరు అక్రమార్కులు చెరువును ఆక్రమించుకొని అందులో పంటలను సాగు చేసుకోవడమే కాకుండా స్థిర నివాసాలను నిర్మించుకున్నారు. రికార్డుల మేరకు ఎగువ చెరువు విస్తీర్ణం 14.30 ఎకరాలుగా ఉంది. కాని అక్కడ చూస్తే చెరువు నాలుగెకరాలు కూడా కనిపించడం లేదు. మిగిలిన పదెకరాల దాకా ఆరుగురు అక్రమార్కులు ఆక్రమించేసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇదే చెరువులో ఆక్రమణపై స్పందించిన అధికారులు గ్రామానికి చెందిన క్రిష్టారెడ్డి, పళని, వెంకటేష్‌తో పాటు మరో ముగ్గురు ఆక్రమించున్నట్లు గుర్తించారు. ఆపై చెరువును కొలిచి ట్రెంచులను కొట్టించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కబ్జాదారులు ఇక మనకెవరూ అడ్డులేదంటూ ఆక్రమణల బాట పట్టారు. మరికొందరు చెరువులో పొలాలకు దారిచేసుకొన్నారు. వర్షాలు కురిసినా చెరువులోకి నీరు రాకుండా సప్లయ్ చానెళ్లను సైతం పొలాల్లోకి కలిపేసుకున్నారు. ఇదే గ్రామానికి సమీపంలో ఉన్న బొమ్మిదొడ్డి చెరువులోనూ ఐదెకరాల దాకా ఆక్రమణలు జరిగాయి. కొందరు చెరువుకు ఆనుకొని ఉండే రైతులు ఏటా కొంత మేర చెరువును ఆక్రమించేసుకున్నారు.

**చెరువుల పరిస్థితి ఇదీ...**

పలమనేరు నియోజకవర్గంలో మొత్తం 787 చెరువులున్నాయి. వీటిల్లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు (100 ఎకరాల విస్తీర్ణం గలవి) 57 దాకా ఉన్నాయి. చిన్నపాటిగా ఉన్న కుంటలు 60 దాకా ఆక్రమణలకు గురై కనిపించకుండా పోయాయి. మిగిలిన వంద దాకా చెరువులు 10 నుంచి 30 శాతం దాకా ఆక్రమణలు జరిగాయి. ఈ చెరువుల కింద ఆయకట్టు గతంలో 20 వేల హెక్టార్లుగా ఉండగా ఇప్పుడు 2 వేల హెక్టార్లలో మాత్రమే పంటలను సాగు చేస్తున్నారు.

**కూటమి నేతల ఆక్రమణలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువులు సర్వనాశనం అయ్యాయి. రియల్ ఎస్టేట్ కోసం చెరువుల్లోని మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. మరోవైపు చెరువుల్లోని ఇసుక కోసం మట్టిని తవ్వి దానికింద ఉండే ఇసుకను తోడేస్తున్నారు. ఇలా నిత్యం వేలాదిలోడ్ల మట్టి, ఇసుక అక్రమార్కులపాలవుతోంది. మరోవైపు తమ పార్టీ అధికారంలో ఉందంటూ కొందరు చెరువులను ఆక్రమించుకున్నారు.



మట్టిని తవ్వేయడంతో కామినేపల్లి చెరువు ఇలా.. చోద్యం చూస్తున్న అధికారులు

చెరువులకు సంబంధించి ఎంఐ ట్యాంకుల పర్యవేక్షణ ఇరిగేషన్ శాఖ, చిన్న చెరువులు ఆయా మండలాలు, సంబంధిత పంచాయతీలు చూసుకోవాలి. కానీ చెరువుల్లో మట్టి, ఇసుకను తోడుకుంటున్నా, చెరువులను ఆక్రమించినా తమకేమి సంబంధం లేదన్నట్లు ఆయా శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు.



బైరెడ్డిపల్లి చెరువులో జోరుగా మట్టి, ఇసుక తవ్వకాలు

**కడుపు మండుతోంది...**



ఏ గ్రామంలోని చెరువునన్నా చూడు మట్టి కోసం గుంతలను తవ్వేశారు. చెరువుల్లోకి నీరు వచ్చే మార్గాలను భూముల్లోకి కలిపేసుకున్నారు. చెరువుల్లోని బంకమట్టిని మొత్తం తోడేస్తే వాన నీళ్లు వచ్చినా చుక్కగాని చెరువులో నిల్వ ఉండవు. పక్కభూముల్లోళ్లు చెరువును ఆక్రమించేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడంలేదు.

–అమరనాథరెడ్డి, కంచిరెడ్లపల్లి, గంగవరం మండలం

**ఆక్రమణలను తొలగిస్తాం**



ఎగువ చెరువు, బొమ్మిదొడ్డి చెరువు ఆక్రమణలపై వెంటనే సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. చెరువులు, వాగులు, వంకలను ఆక్రమించుకున్నా అవి ఎన్నటికీ ప్రభుత్వానికి చెందినవేగాని రైతులకు హక్కురాదు. ఆక్రమణదారుల విషయంలో ఉపేక్షించేది లేదు. తమ సిబ్బంది ద్వారా వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

–ఇన్బనాథన్, తహసీల్దార్, పలమనేరు

### రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకోండి



రైతుబజార్ సేవలను పరిశీలిస్తున్న ఏడీ

**పలమనేరు:** రైతుబజార్‌లో రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకోవచ్చునని, అలాగే తక్కువ ధరతో ఇక్కడ కాయగూరలు అందుబాటులో ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ సూచించారు. ఆ మేరకు రైతుబజార్‌ను ఆయన స్థానిక మార్కెట్ సెక్రటరీ సంజీవకుమార్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. వ్యాపారులు, రైతులు, కొనుగోలుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బయట కూరగాయలను విక్రయించే ధరల కంటే రైతుబజార్‌లో తక్కువ ధరకు కొనుక్కోవచ్చునని తెలిపారు. ఇక్కడ రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకొనేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసి సిబ్బంది జ్ఞానాంభ, లోకేష్, భార్గవ్, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

### బోయకొండలో రాహుకాల పూజలు



అలంకరణలో అమ్మవారు

**చౌడేపల్లె:** బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో సంప్రదాయ రీతిలో అర్చనలు, అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అమ్మవారిని ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

# కనులపండువగా రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



రథోత్సవంపై ఊరేగుతున్న శ్రీవారు



రథాన్ని లాగుతున్న భక్తులు



భక్త జన సందోహం మధ్య రథంపై ఊరేగుతున్న స్వామివారు

**పుంగనూరు:** పట్టణంలో కోనేటి వద్ద వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సుప్రభాతసేవతో పూజలు ప్రారంభించారు. ఉదయం స్వామి వారిని రథోత్సవంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు తమ ఇళ్ల ముందు నీళ్లుచల్లి స్వామి రథానికి పూజలు చేసి స్వాగతం పలికారు. రాత్రి స్వామి వారిని అశ్వ వాహనంపై ఊరేగింపు చేసి పూజలు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

**బైరెడ్డిపల్లెలో..**

**బైరెడ్డిపల్లె:** మండలంలోని కడపనత్తం సమీపంలో వెలసిన శ్రీ నల్లగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై శ్రీఅలివేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయ స్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మరథాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**శాంతిపురంలో..**

**శాంతిపురం:** రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథంపై స్వామి ఊరేగారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రాతి చక్రాల రథంపై సీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. రాతి చక్రాలతో 67 అడుగుల ఎత్తైన రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మొక్కులు ఉన్న భక్తులు స్వామి రథంపై ఉప్పు, మిరియాలు, దవనం చల్లి తమ కష్టాలు తీర్చిన స్వామిని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. రథం ముందు మంగళ వాయిద్యాలు, కోలాటలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆలయంలో స్వామిని దర్శించుకుని, రథాన్ని లాగారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# ఆత్మీయ వీడ్కోలు సమావేశం



అప్పినపల్లిలో సమావేశమైన విద్యార్థులు

**పెద్దపంజాణి:** మండలంలోని అప్పినపల్లి జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తొలుత సరస్వతీ చిత్రపటానికి పూజలు చేశారు. ఓం ఆకారంలో వేసిన ముగ్గు వద్ద విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదే విధంగా రాజుపల్లి జడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నందకుమార్, ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

# రూ.లక్షల ప్రజాధనం రాళ్లపాలు





నిరుపయోగంగా నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనం, భవనం లోపల తేలిన గచ్చు

**కుప్పంరూరల్:** కుప్పం పట్టణానికి సమీపంలోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. గత టీడీపీ హయాంలో పట్టణానికి సమీపంలోని మోడల్ కాలనీ వద్ద నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి దాదాపు అర ఎకరా స్థలం కేటాయించారు. లక్షల రూపాయలు వెచ్చించి స్టేజ్ వరకు నిర్మాణాలు చేపట్టారు. అక్కడితో పనులు ఆగిపోవడంతో ప్రాంగణం ఇనుప కమ్మీలతో దర్శనమిస్తోంది. ప్రస్తుతం శుభకార్యాలు, సమావేశాలు జరగక లక్ష్యం నీరుగారుతోంది. దీంతో మద్యంబాబులకు ఆవాసంగా మారింది. భవనం మొత్తం పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. రూ.లక్షల ప్రజాధనం వృథా కావడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రంగుల పండుగ.. ఆనందం నిండుగ..







**సదుం:** సంబరాలు చేసుకుంటున్న మార్వాడీలు, **పలమనేరు:** సంబరాల్లో విద్యార్థినులు, **బైరెడ్డిపల్లె:** హోలీ సంబరాల్లో యువకులు

**పుంగనూరు:** హోలీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం సుగాలిమిట్టలో గిరిజనులు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన మార్వాడీలు, సేట్‌లు, వారి కుటుంబ సభ్యులు రంగులు చల్లుకుని వేడుకలు జరుపుకున్నారు.

**సదుం:** మండల కేంద్రంలో హోలీ సంబరాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మార్వాడీ కుటుంబాలలోని పెద్దలు, చిన్నారులు కలిసి రంగులు చల్లుకొని సందడి చేశారు. బంధువుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకొని పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు.

**బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలో శుక్రవారం మార్వాడీలు హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మాతా ఆలయం వద్ద మార్వాడీలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

**రొంపిచెర్ల:** మండల కేంద్రమైన రొంపిచెర్లలో హోలీ పండుగను రాజస్థాన్‌కు చెందిన యువత ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం రొంపిచెర్ల పుర వీధుల్లో కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

**చౌడేపల్లె:** మండల కేంద్రంలోని మార్వాడీలు శుక్రవారం హోలీ సంబరాలు చేసుకొన్నారు. హనుమాన్ పటేట్ మిత్ర బృందం ఆధ్వర్యంలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి రంగులు చల్లుతూ డ్యాన్స్‌లతో అదరగొట్టారు.

**పలమనేరు:** పట్టణంలోని రాజస్థాని వాసులు శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగులను చల్లుకుంటూ ఆనందోత్సవాల్లో పాల్గొన్నారు. ఏటా పండుగను ఘనంగా జరుపుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు.

### ట్రాఫిక్ సమస్యకు చెక్

- గంగమ్మగుడి వీధిలో రోడ్డుపై దుకాణాల తొలగింపు



రోడ్డుపై ఉన్న దుకాణాలను తొలగించడంతో విశాలమైన వీధి

**పలమనేరు:** పట్టణంలో రద్దీగా ఉన్న వీధుల్లో రోడ్లపైకొచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం ఖాళీ చేయించారు. దీంతో కొన్నాళ్లుగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న గంగమ్మవీధి, ఎస్‌బీఐ వీధుల్లో ట్రాఫిక్ సమస్య ఒక కొలిక్కి వచ్చింది. ఇదే అంశంపై కొన్ని నెలలుగా పలువురు కౌన్సిలర్లు సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తమ సిబ్బందితో కలసి రోడ్డుపై పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్న దుకాణ దారులను తొలగింపజేశారు. తాజాగా ప్రారంభమైన రైతుబజార్‌లో అన్ని రకాల వ్యాపారాలను చేసుకోవాలని అక్కడికి తరలించారు. ఇప్పటి దాకా కనీసం బైక్‌లు కూడా వెళ్లేందుకు ఇబ్బందిగా ఉన్న శివాలయం వీధి, ఎస్‌బీఐ, గంగమ్మగుడి ప్రాంతాలు ప్రశాంతంగా ట్రాఫిక్ సమస్య లేకుండా మారాయి. మున్సిపల్ అధికారుల చొరవపై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే రీతిలో పట్టణంలోని జవిళివీధి, బజారు వీధి, టీకే స్ట్రీట్‌లోనూ ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

# పేదల ఊటీలో నిప్పులసెగ

- పలమనేరులో ఎండల దడ
- ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

**పలమనేరు:** మార్చి నెల ఆరంభమై పదిహేను రోజులు కాలేదు. పేదల ఊటీగా పిలువబడే పలమనేరులో వేసవి సెగలు దడ పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం పలమనేరులో గరిష్ఠంగా పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు పైగా చేరుతోంది. ఇక్కడే ఇలా ఉంటే ఇక ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతిలో ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. గతంతో పోలిస్తే ఈ విడత వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా ఉంటాయని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే వచ్చే మే నెలలో ఇంటి నుంచి కాలు బయటకు పెట్టాలంటే భయపడాల్సిందే. నిత్యం పనులకెళ్లే వారు, వ్యవసాయ కూలీలు, సంస్థల్లో పనిచేసే కార్మికులు తప్పని పరిస్థితుల్లో ఎండలోనే పనులు చేయాల్సి ఉంటుంది. తరచూ శరీరం నుంచి వెలువడే చెమటతో ఇబ్బందులు తప్పవు. మనిషి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితిలో ఉన్నప్పుడు శారీరక పనితీరు సక్రమంగా ఉంటుంది. అయితే అధిక వేడి ఉత్పన్నమైనప్పుడు ఉక్కపోత తప్పదు. శరీరంలోని స్వేద రంధ్రాల ద్వారా మనం తాగిన నీరు చెమట రూపంలో విడుదలవుతుంది. ఇలా అధికంగా శరీరంలో నీరు కోల్పోవడంతో డీ హైడ్రేషన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎండ ఉపశమనం కోసం వైద్యుల సూచనలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**వడదెబ్బ సోకకుండా జాగ్రత్త పడదాం**

సన్ స్ట్రోక్‌లతో శరీరం అధిక ఉష్ణోగ్రతలకు గురైనపుడు నాడీ వ్యవస్థపై ప్రభావం పడి మెటబాలిజంలో హీట్ జనరేట్ అవుతుంది. దీని కారణంగా శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 43 డిగ్రీలకు చేరుకుంటే వడదెబ్బ తప్పదు. ముఖ్యంగా రెండేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, క్రీడాకారులు ఎండలో పనిచేసే వారు దీనికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి సమయాల్లో మొదట రోగి బట్టలు తీసి చల్లటి నీటితో శరీరాన్నంతా తుడిచి ఐస్ వాటర్‌తో తడిపిన బట్టను కప్పాలి. భుజాల కింద, గజ్జలలో ఐస్ ముక్కలను ఉంచాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. నివారణోపాయాలుగా తరచుగా చల్లని నీటిని తాగుతూ ఉండాలి మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగరాదని సూచిస్తున్నారు.



ఎండలో పనులు చేస్తున్న కూలీలు

**జాగ్రత్తలు తప్పనిసరి**



ఎండలో కెళ్లే ముందు తలపై ఆచ్ఛాదనగా టోపీ లేదా గొడుగు ధరించాలి. కళ్లకు నల్లటి కూలింగ్ గ్లాసెస్ పెట్టుకోవడం మేలు. కూలి పనులు చేసే వారు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల దాకా ఎక్కువ ఎండలో ఉండరాదు. నీటితో పాటు కొబ్బరి బోండాలు, పుచ్చ కాయలు లాంటివి తీసుకోవాలి. ఉదయం పూట మనిషి శరీరానికి చలువ చేసే రాగి జావా వేసవి తాపానికి ఎంతో విరుగుడు.

–డా.యుగంధర్, ఏరియా ఆస్పత్రి, పలమనేరు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441